సాక్షి
ఖమ్మం
బుధవారం । 13 । మార్చి । 2024




పాట్లు పడితేనే పాస్‌పోర్ట్
జిల్లా కేంద్రంలోని పాస్‌పోర్ట్ సెంటర్‌లో వెరిఫికేషన్ అధికారి లేక దరఖాస్తుదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.
8లో



'రైతునేస్తం' ద్వారా సలహాలు
ఐదు రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటుచేయగా.. వివిధ ప్రాంతాల నుంచి శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు చేశారు.
8లో

గరిష్టం / కనిష్టం
39° / 24°
వాతావరణం
జిల్లాలో బుధవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. మధ్యాహ్నం గరిష్టస్థాయికి చేరే అవకాశముంది.



న్యూస్‌రీల్

ఈ-కేవైసీ అప్‌డేట్ చేయించుకోండి

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద అర్హులైన వారికి గ్యాస్ సబ్సిడీ ప్రకటించిన క్రమాన ఎల్పీజీ వినియోగదారులు ఈ-కేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ సూచించారు. ఈ విషయమై సంబంధిత గ్యాస్ ఏజెన్సీలను లేదా గ్యాస్ డెలివరీ బాయ్స్‌ను సంప్రదించాలని తెలిపారు. అలాగే, బ్యాంక్ ఖాతాలో కూడా ఈ-కేవైసీ వివరాలు అప్‌డేట్ చేయించుకోవాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

ఇంటర్ పరీక్షలకు 508 మంది గైర్హాజరు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఇంటర్‌మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరగగా, 17,057మంది విద్యార్థులకు 16,549మంది హాజరు కాగా 508మంది గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు తెలిపారు. హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు 34పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయని వెల్లడించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: డీఎస్సీ ఎస్జీటీ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఖమ్మంలోని బీసీ స్టడీసర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ జి.శ్రీలత తెలిపారు. అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు ఈనెల 14నుండి 22వ తేదీలోగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుంటే, ఇంటర్మీడియట్, టీటీసీ, టెట్ మార్కుల ఆధారంగా ఎంపిక చేసినవారికి ఈనెల 26నుండి 75 రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే, హైదరాబాద్‌లో బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌పై ఉచిత శిక్షణ కోసం బీసీ అభ్యర్థుల దరఖాస్తు చేసుకోవచ్చని డైరెక్టర్ తెలిపారు. ఈనెల 15 నుండి 25లోగా స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, 31న ఖమ్మంలో జరిగే స్క్రీనింగ్ పరీక్ష ద్వారా 30మందిని ఎంపిక చేస్తామని వెల్లడించారు.

డీఎస్సీ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్

డీఎస్సీ ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ లేదా పుస్తకాల కొనుగోలుకు రూ.1,500 అందజేయనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలో 10 వేల మందికి (7వేల మంది ఎస్జీటీ అభ్యర్థులు, 3వేల మంది స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థుల)కు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న బీసీ అభ్యర్థులు ఈనెల 14 నుండి ఏప్రిల్ 5వ తేదీలోగా స్టడీసర్కిల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 95738 59598, 08742-227427 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

లోక్ అదాలత్‌పై విస్తృత అవగాహన

ఖమ్మంలీగల్: కక్షిదారులకు సత్వరం న్యాయం కోసం ఈనెల 16న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ జావేద్‌పాషా సూచించారు. జిల్లా కోర్టులో ఆయన పోలీస్ కోర్టు డ్యూటీ ఉద్యోగులతో మంగళవారం సమావేశయ్యారు. ఈ సందర్భంగా జావేద్‌పాషా మాట్లాడుతూ రాజీ పడడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కాగా, జాతీయ లోక్ అదాలత్ నిమిత్తం జిల్లాలోని కోర్టుల్లో 14బెంచ్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైజన్ అధికారి మోహన్‌రావు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

హెలీప్యాడ్‌కు స్థలపరిశీలన

మధిర: వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం మధిర రానున్నారు. ఈమేరకు వంద పడకల ఆస్పత్రి సమీపాన హెలీప్యాడ్ ఏర్పాటు చేస్తుండగా, పనులను మంగళవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ షఫీఉల్లా, సీఐ మధు, ఎస్‌ఐ సంధ్య, నాయకులు పరిశీలించారు. కాగా, అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ఇతర కార్యక్రమాలకు భట్టి తరచుగా వస్తుండగా, నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో హెలీప్యాడ్లు ఏర్పాటుచేస్తున్నారు. ఇప్పటికే ఎర్రుపాలెం, చింతకాని మండలాల్లో ఏర్పాటుచేయగా, మధిరలోనూ సిద్ధమైంది.

కమలంలో కిటకిట!

ఖమ్మం లోక్‌సభ టికెట్‌కు పలువురి పోటీ

- అధిష్టానం ఆశీస్సులు తమకేనంటూ ఆశావహుల ధీమా
- బలమైన అభ్యర్థికే టికెట్ దక్కొచ్చని ప్రచారం
- మాజీ ఎమ్మెల్యే జలగం చేరికతో మారిన సమీకరణలు



ఖమ్మం లోక్‌సభ టికెట్ కోసం బీజేపీలో పలువురు పోటీ పడుతున్నారు. కొందరు ఇప్పటికే టికెట్ తమకేనని ప్రచారం చేసుకుంటూ ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ ఏర్పాటుచేస్తున్నారు. ఇంతలోనే మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు బీజేపీలో చేరడంతో టికెట్ విషయంలో సమీకరణలు మారాయన్న ప్రచారం మొదలైంది. గత నెల రోజులుగా టికెట్ తమకేనని చెప్పుకుంటున్న వారికి పార్టీ నాయకత్వం ఆశీస్సులు ఉన్నాయా లేక జలగంకే టికెట్ దక్కుతుందా అన్న చర్చ బీజేపీ శ్రేణుల్లో జరుగుతోంది.

–సాక్షిప్రతినిధి, ఖమ్మం

బలమైన అభ్యర్థి కోసం..

ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా... తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కడ కూడా పార్టీ అభ్యర్థులకు డిపాజిట్ దక్కలేదు. ఉమ్మడి జిల్లా రాజకీయ చరిత్రను పరిశీలించినా అదే పరిస్థితి కనిపిస్తుంది. రాష్ట్రంలోని మిగతా జిల్లాలతో పోలిస్తే ఇక్కడ బీజేపీ ప్రభావం తక్కువగా ఉండగా.. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆ పార్టీ ప్రతీ నియోజకవర్గానికి కేంద్ర మంత్రులు, రాష్ట్ర ముఖ్య నేతలను ఆహ్వానించి ప్రచారం చేసినా ఆశించిన ఫలితం రాలేదు. బలమైన నాయకత్వ లేమికి తోడు కాంగ్రెస్, వామపక్షాలు, బీఆర్‌ఎస్‌తో పోలిస్తే క్షేత్ర స్థాయిలో కేడర్ లేకపోవడంతో ప్రతీ ఎన్నికల్లోనూ నామమాత్రంగానే మిగులుతోంది. అయితే, ఈసారి దేశవ్యాప్తంగా అత్యధిక సీట్లు గెలవాలనే లక్ష్యంతో ఉన్న బీజేపీ నాయకత్వం బలమైన అభ్యర్థుల కోసం అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా ఖమ్మంలో కూడా రాజకీయంగా ప్రాధాన్యత ఉన్న అభ్యర్థిని పోటీకి దింపితే ప్రయోజనం ఉంటుందన్న ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది.

ఆశావహులు ఎక్కువే..

రాజకీయ ఉద్దండులను అందించిన ఖమ్మం నుంచి పోటీ చేసేందుకు బీజేపీలో ఆశావహులు ఎక్కువగానే ఉన్నారు. మూడో సారి కేంద్రంలో బీజేపీ నేతృత్వాన ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తుందన్న ప్రచారంతో ఇక్కడ నుంచి బరిలోకి దిగితే.. గెలుపోటముల మాటేమో కానీ పార్టీ పరంగానైనా ప్రాధాన్యత ఉంటుందన్న భావనతో ఆశావహులు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, దేవకి వాసుదేవరావు, గల్లా సత్యనారాయణ, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, ఈ.వీ.రమేష్, తాండ్ర వినోద్‌రావు పోటీలో ఉన్నట్లు చెబుతూ జాతీయ స్థాయిలో ముఖ్య నేతలను కలిశారు. ఇందులో ఇద్దరు నేతలు ఫ్లెక్సీలు, హోర్డింగ్‌ల ద్వారా ప్రచారం కూడామొదలుపెట్టారు. ఇటీవల పార్లమెంట్ పరిధిలో బీజేపీ నిర్వహించిన విజయ సంకల్ప యాత్రలోనూ ఆశావహులు హడావుడి చేశారు.

జలగం చేరికతో..

మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు బీజేపీలో చేరికతో ఆయనే లోక్‌సభ ఎన్నికల్లో బరిలో దిగుతారని అనుచరులు ప్రచారం చేస్తున్నారు. గత ఎన్నికల్లో కొత్తగూడెం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసిన ఆయన ద్వితీయ స్థానంలో నిలిచారు. గతంలో ఎమ్మెల్యేగా గెలవడం, కుటుంబ రాజకీయ నేపథ్యం.. తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని బీజేపీ జలగంకే టికెట్ కేటాయిస్తుందని అనుచరుల్లో ధీమా వ్యక్తమవుతోంది. లోక్‌సభ పరిధిలో ఆయనకు ఉన్న అనుచరగణం, పార్టీ లీడర్, కేడర్ కలిపితే జలగం బలమైన అభ్యర్థిగా ఉంటారని బీజేపీ నేతలు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. ఇదే నిజమైతే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులకు సమ ఉజ్జీగా నిలుస్తారని, ఈ స్థానంలో త్రిముఖ పోరు తప్పదని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం కండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

ఖమ్మం సహకారనగర్: రానున్న పార్లమెంట్ ఎన్నికలను ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సజావుగా నిర్వహించేలా యంత్రాంగం సిద్ధం కావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. స్వీప్ కార్యక్రమాల నిర్వహణ, ఓటర్ల నమోదు దరఖాస్తుల పరిశీలన తదితర అంశాలపై మంగళవారం ఆయన నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను కట్టుదిట్టంగా నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, ఈవీఎం యంత్రాలు, ఉద్యోగుల శిక్షణ ఇతర ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

పకడ్బందీగా 'స్వీప్' అమలు

జిల్లాలో స్వీప్ కార్యాచరణ పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన స్వీప్ కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన అందరూ ఓటుహక్కు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించడంతో పాటు ఓటు ప్రాముఖ్యత వివరించేలా ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అందరూ ఓటు వేసేలా పాఠశాలల్లో సంకల్ప పత్రాలు పంపిణీ చేసి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సంతకాలు సేకరించాలని సూచించారు. అలాగే, పర్యాటక ప్రాంతాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని తెలిపారు.

వేగంగా దరఖాస్తుల పరిష్కారం

పెండింగ్‌లో ధరణి దరఖాస్తులను వేగంగా పరిష్కరించడంపై దృష్టి సారించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అదనపు కలెక్టర్, ఆర్డీఓలు, తహసీల్దార్లతో సమీక్షించారు. జిల్లాలో 10,273 ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా 4,180 దరఖాస్తులు పరిష్కరించామని తెలిపారు. మిగతావి కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తూ పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, వివిధ శాఖల అధికారులు కె.శ్రీరామ్, సోమశేఖరశర్మ, వినోద్, అజయ్‌కుమార్, ఎం.రాజేశ్వరి, జి.గణేష్, సునీల్‌రెడ్డి, నాగేశ్వరరావు, మదన్‌గోపాల్, మీనన్, రాంబాబు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం స్వామి వారికి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో అర్చకులు స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. కాగా, మంగళవారం కావడంతో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకం, ప్రత్యేక పూజలను గావించారు.

కొందరికే బిల్లులా?

- కేఎంసీ అధికారులతో కాంట్రాక్టర్ల వాగ్వాదం
- కమిషనర్ ఆదేశాలతో సముదాయించిన ఈఈ



ఖమ్మం మున్సిపల్ కార్యాలయం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఇంజనీరింగ్ విభాగంపై ఎన్ని విమర్శలు వచ్చినా అధికారుల తీరు మారడం లేదని తెలుస్తోంది. పనుల పర్యవేక్షణ, టెండర్ల ఖరారు ఇలా ప్రతీ అంశంలో అపవాదు ఎదుర్కొంటున్న అధికారులు చివరకు బిల్లుల చెల్లింపులోనూ అప్రతిష్ట కొనితెచ్చుకుంటున్నారనే చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల సమయాన పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు ప్రక్రియ ఇటీవల మొదలుపెట్టారు. అయితే, ఒకరిద్దరికే ఎక్కువ మొత్తం చెల్లించేలా.. మిగిలిన వారికి నామమాత్రంగా చెల్లించేలా ఫైళ్లు సిద్ధం చేసినట్లు బయటకు తెలిసింది. దీంతో కాంట్రాక్టర్లు పలువురు మంగళవారం ఇంజనీరింగ్ విభాగంలోకి వెళ్లి అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇప్పటికే ఒకరిద్దరికి ఎక్కువ మొత్తంలో పనులు కేటాయించి వారికే బిల్లులు చెల్లిస్తే చిన్న కాంట్రాక్టర్ల పరిస్థితి ఏమిటంటూ గొడవకు దిగారు. అయితే, కమీషన్లు ఇచ్చిన ఒకరిద్దరికే ఎక్కువ మొత్తంలో బిల్లులు చెల్లించాలని ఇంజనీర్ అధికారులు ఫైళ్లు సిద్ధం చేసిన విషయం బయటపడడంతో గొడవకు దిగినట్లు తెలుస్తోంది.

కమిషనర్ వద్దకు సమస్య

కేఎంసీలో బిల్లుల చెల్లింపు అంశంపై అధికారులు, కాంట్రాక్టర్లకు తలెత్తిన వివాదం కమిషనర్ ఆదర్శ్ సురభి దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన ఆదేశాలతో ఈఈ కృష్ణాలాల్ రంగంలోకి దిగారు. కాంట్రాక్టర్లను పిలిచి మాట్లాడిన ఆయన అందరికీ బిల్లులు చెల్లిస్తూ సమన్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఈవిషయమై ఈఈని వివరణ కోరగా, కాంట్రాక్టర్లు అందరికీ బిల్లులు చెల్లిస్తామని చెప్పామని, వివాదం సద్దుమణిగిందని తెలిపారు.

తరుముకొస్తున్న తాగునీటి గండం

- 9.5అడుగులకు పడిపోయిన పాలేరు నీటిమట్టం
- ఇంకొన్ని రోజులకే సరిపడా నీరు
- సాగర్ జలాలు రాకపోతే ఇక్కట్లే



వెలవెలబోతున్న పాలేరు రిజర్వాయర్

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం రోజురోజుకు గణనీయంగా తగ్గిపోతోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా, మంగళవారం సాయంత్రం 9.5అడుగులకు పడిపోయింది. ఆరు అడుగుల వరకు రిజర్వాయర్ నుంచి తాగునీటి పథకాలకు నీరు సరఫరా చేసే అవకాశముండగా.. ఆతర్వాత పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 0.800 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉండగా, ప్రతిరోజు తాగునీటి పథకాలకు 135.45 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

మూడు జిల్లాలకు ఇక్కడి నుంచే..

పాలేరులోని మిషన్ భగీరథ ప్రాజెక్టు నుండి ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల పరిధి 2,439 ఆవాసాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఇక కూసుమంచి మండలంలోని మరో 75 ఆవాసాలకు తాగునీరు అందించే డీ ఫ్లోరైడ్ ప్రాజెక్టుల(పాతవి)కు సైతం ఇక్కడి నుంచే నీరు సరఫరా అవుతోంది. కాగా కూసుమంచిలోని పంప్‌హౌస్‌కు రిజర్వాయర్ నుండి నీరు అందకపోవడంతో అధికారులు ఇటీవల పొక్లెయినర్‌తో కాల్వ తవ్వించగా పరిస్థితి కొంత మెరుగైంది. అయితే, రిజర్వాయర్ నీటిమట్టం మరింత పడిపోతే ఇటు మిషన్ భగీరథ, అటు కూసుమంచి ప్రాజెక్టులకు నీరు అందడం కష్టమేనని తెలుస్తోంది. ఇదేకాక ఖమ్మం కార్పొరేషన్‌కు కూడా పాలేరు రిజర్వాయర్ నీరే ఆధారం. ఇక్కడి నుండి ఎడమ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసి మున్నేరు, లకారం చెరువులకు నింపుతున్నారు. నెలలో రెండుసార్లు ఖమ్మం నగరానికి పాలేరు నుండి 500 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేయాల్సి వస్తోంది. ఇప్పుడు పాలేరులో నీటిమట్టం పడిపోతున్నందున నీరు వదలకపోతే ఖమ్మం నగరవాసులకు తాగునీటి కష్టాలు ఎదురయ్యే అవకాశముంది.

సాగర్ నీరే శరణ్యం

పాలేరు రిజర్వాయర్‌కు సాగర్ నుండి నీటిని విడుదల చేస్తేనే తాగునీటి కష్టాలు తీరనున్నాయి. కాగా, రిజర్వాయర్ అడుగంటిన నేపథ్యాన సాగర్ జలాలు విడుదల చేయాలని జిల్లా జలవనరుల శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. మరోపక్క గ్రామాల్లో తాగునీటి ఇక్కట్లు ఎదురుకాకుండా బోరు, బావుల నీటిని వినియోగిస్తున్నారు.

వందేభారత్ -2 ప్రారంభం



రైలును ప్రారంభిస్తున్న మేయర్ నీరజ, పద్మశ్రీ రామయ్య, అధికారులు

ఖమ్మం మామిళ్లగూడెం: సికింద్రాబాద్ నుండి విశాఖపట్నం మధ్య ఇప్పటికే ఒక వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడుస్తుండగా మరో రైలును ప్రవేశపెట్టారు. ఈ రైలును మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించగా, ఖమ్మం స్టేషన్‌కు చేరుకున్నాక మేయర్ పునుకొల్లు నీరజ, పద్మశ్రీ వనజీవి రామయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా సీసీఐ ఎం.డీ.జాఫర్ మాట్లాడుతూ సికింద్రాబాద్ నుండి విశాఖపట్నం మధ్య ప్రవేశపెట్టిన రెండో వందే భారత్ రైలు(20707) సికింద్రాబాద్‌లో ఉదయం 05-05గంటలకు బయలుదేరి ఉదయం 07-45 గంటలకు ఖమ్మం చేరుకుంటుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో విశాఖపట్నంలో మధ్యాహ్నం 2-35గంటలకు బయలుదేరే రైలు(20708) ఖమ్మం స్టేషన్‌కు రాత్రి 8-03 గంటలకు వస్తుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అధికారులు పరమేష్, వి.రవికాంత్, జీఎస్వీ.ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రసన్నకుమార్, శ్రీనివాస్, మోహన్ కుమార్ శైలేంద్ర, బీజేపీ నాయకులు మంద సరస్వతి, దోకుపర్తి రవీందర్‌కుమార్, రవిరాథోడ్, దీకొండ శ్యాం, స్వాతంత్ర సమరయోధుడు ఎం.వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1.25 లక్షల ఎకరాలకు ఢోకా లేనట్లే..

- వైరా రిజర్వాయర్‌కు 'సీతారామ' అనుసంధానం
- లింక్ కెనాల్ నిర్మాణానికి రూ.100కోట్లు
- బ్యాలెన్సింగ్‌గా మారనున్న రిజర్వాయర్.. నిరంతరం 18.4 అడుగుల మేర నీరు
- నేడు శంకుస్థాపన చేయనున్న డిప్యూటీ సీఎం, మంత్రులు

వైరా: జిల్లాలో అన్నపూర్ణగా పేరుగాంచిన వైరా రిజర్వాయర్ ఎట్టకేలకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా రూపుదిద్దుకోనుంది. ఈ రిజర్వాయర్ ద్వారా సాధారణ సమయంలో నీటి వసతికి ఇబ్బంది లేకున్నా ఏటా వేసవిలో నీటి నిల్వలు తగ్గిపోయి తాగు, సాగు అవసరాలకు టిక్కట్లు ఎదురవుతున్నాయి. దశాబ్దాలుగా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చాలనే ప్రతిపాదనలు ఉన్నా కార్యరూపం దాల్చలేదు. ఎట్టకేలకు కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌లోకి మళ్లించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

ఏం చేస్తారంటే...

సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఇప్పటికే జూలూరుపాడు మండలం వినోభానగర్ వరకు కాల్వ పనులు చేపట్టారు. అక్కడి నుండి సుమారు 9 కిలోమీటర్లు మేర ఏన్కూరు మండలం తిమ్మరావుపేట సమీపంలో సాగర్ కాల్వకు అనుసంధానం చేసేలా లింక్ కెనాల్ నిర్మిస్తారు. ఆపై అక్కడి నుండి ఎస్కేప్ లాకుల ద్వారా గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌లోకి మళ్లించనున్నారు. అంతే కాకుండా వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాలకు సైతం గోదావరి జలాలను తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. మూడు నియోజకవర్గాల పరిధిలో 1.25 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడమే కాక వేంసూరు, లంకాసాగర్, చెరువులకు కూడా ఇదే నీటిని మళ్లించాలనే ప్రణాళిక రూపొందించారు. సీతారామ ప్రాజెక్ట్ పనుల్లో భాగంగా 9 కిలోమీటర్ల మేర కెనాల్ పనులను యుద్ధ ప్రాతిపదిక పూర్తి చేసేందుకు రూ.100 కోట్ల నిధులను కేటాయించగా... వచ్చే జూన్, జూలై నాటికి నిర్మాణం పూర్తిచేసి సాగునీటిని అందించాలనే లక్ష్యంగా తెలుస్తోంది.

వైఎస్ హయాంలోనే బీజం

దివంగత మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి రెండో పర్యాయం సీఎంగా ఎన్నికయ్యాక వైరా రిజర్వాయర్ అభివృద్ధికి జైకా నిధులు రూ. 55 కోట్లను మంజూరు చేయించారు. ఈ నిధులతో రిజర్వాయర్ కాల్వల ఆధునికీకరణ పనులు చేపట్టగా.. దుమ్ముగూడెం టెయిల్‌పాండ్ నుంచి వైరా, పాలేరు రిజర్వాయర్లను నింపేలా పైప్‌లైన్ నిర్మాణ పనులు సైతం మొదలుపెట్టారు. ఆతర్వాత వచ్చినప్రభుత్వాలు వైరా రిజర్వాయర్ అభివృద్ధిపై దృష్టి పెట్టకపోగా నిధులు రాలేదు. ఫలితంగా కుడి, ఎడమ కాల్వల పరిధిలో కాల్వల లైనింగ్ పనులు, రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు పూర్తిస్థాయి జరకగ చివరి భూములకు సీరందకపోవడంతో రైతులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఎట్టకేలకు సీతారామతో వైరా రిజర్వాయర్ అనుసంధానానికి కెనాల్ నిర్మించనుండడంతో దశాబ్దాల కల అయిన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మారనుంది. ఆపై నిత్యం 18.4 అడుగుల మేర నీరు నిల్వ ఉండే అవకాశముంటుంది.

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే



వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే రాందాస్

వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలను మళ్లించేలా నిర్మించే కెనాల్ పనులకు బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన వైరాలో ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, నాయకులు దాసరి దానియేలు, శీలం వెంకటనర్సిరెడ్డి, కట్ల రంగారావు, కట్ల సంతోష్, పమ్మి అశోక్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

రఘునాథపాలెం బైపాస్‌లో మెడికల్ కాలేజీ?

30 ఎకరాల ప్రభుత్వ స్థలం గుర్తింపు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనాలను రఘునాథపాలెం బైపాస్‌రోడ్డులో నిర్మించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. గత ఏడాది అప్పటి ప్రభుత్వం జిల్లాకు మెడికల్ కాలేజీని మంజూరు చేసింది. దీంతో ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి ఎదురుగా ఉన్న పాత కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ కార్యాలయాల ప్రాంగణంలో మొదటి ఏడాది తరగతులను ప్రారంభించారు. అయితే, ఏటా విద్యార్థుల సంఖ్య పెరగనుండగా, ప్రస్తుత భవనాలు సరిపోవనే భావనతో కాలేజీ కోసం నాగ్‌పూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సమీపాన అనువైన స్థలాన్ని గుర్తించాలని ఉన్నతాధికారులు సూచించినట్లు సమాచారం. దీంతో రెవెన్యూ అధికారులు రఘునాథపాలెం బైపాస్‌లోని బల్లేపల్లి వద్ద ఉన్న సుమారు 30ఎకరాల ప్రభుత్వ భూమి వివరాలతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. రఘునాథపాలెం రెవెన్యూలోని సర్వే నంబర్ 218లో గతంలో కొందరికి ఇళ్ల స్థలాలు కేటాయించగా, ఇంకొంత కోర్టు కేసులో ఉంది. అదిపోగా ఎలాంటి వివాదం లేని 15 ఎకరాలు, ఖమ్మం అర్బన్ బల్లేపల్లి రెవెన్యూలోని సర్వే నంబర్ 137, 138 పరిధిలో మరో 15ఎకరాలు కలిపి 30 ఎకరాలతో నివేదిక సమర్పించినట్లు సమాచారం. ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేస్తే మెడికల్ కాలేజీ రఘునాథపాలెం బైపాస్‌రోడ్డులో ఏర్పాటుకానుంది.

క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సాయంత్రం హెలీకాప్టర్‌లో మధిరకు చేరుకుని మధిర నుంచి నిదానపురం వరకు నాలుగు లేన్ల రహదారి, మధిర నుంచి ఆత్కూరు బీటీ రోడ్డు విస్తరణ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత వైరా చేరుకుని సీతారామ ప్రాజెక్టు ద్వారా వైరా రిజర్వాయర్‌కు నీరందించేలా నిర్మించనున్న లింక్ కెనాల్ పనులకు శంకుస్థాపన చేస్తారు. వైరాలో జరిగే కార్యక్రమంలో భట్టి, ఉత్తమ్‌తో పాటు మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా పాల్గొంటారు.

మంత్రి పొంగులేటి..

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఉదయం 10 గంటలకు కూసుమంచి మండలం నాయకన్‌గూడెం చేరుకోనుండగా, వివిధ గ్రామాల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశాక మహబూబాబాద్ జిల్లాకు వెళ్తారు. తిరిగి మధ్యాహ్నం 1.30 గంటలకు తిరుమలాయపాలెం మండలానికి చేరుకుని ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయడంతో పాటు ఖమ్మం రూరల్ మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పరిశీలన



దరఖాస్తును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

చింతకాని: మండలంలోని వందనం గ్రామంలో అందిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ మంగళవారం పరిశీలించారు. గ్రామంలో 1,818 మంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకోగా, అందులోని వివరాల ఆధారంగా క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తిచేయాలని ఉద్యోగులకు సూచించారు. ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్, జీపీ కార్యదర్శులు చెవుల మహేష్, ఈశ్వరాచారి, వినోద్‌కుమార్, శివశంకర్, విజయరామారావు తదితరులు పాల్గొన్నారు.


ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ తనిఖీ



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న సీఈఓ

ముదిగొండ: ఎంపీడీఓ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ ఎస్.వినోద్ మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఉద్యోగుల హాజరుపై ఆరా తీసిన ఆయన, ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తులు ఇస్తున్న వారితో మాట్లాడారు. ఇప్పటివరకు అందిన దరఖాస్తులు, ఆన్‌లైన్‌లో నమోదుపై ఉద్యోగులతో సమీక్షించారు. ఏ రోజు వచ్చిన దరఖాస్తులను అదే రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆతర్వాత ఉపాధి హామీ పనులపై సూచనలు చేశారు. ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంపీఓ సూర్యనారాయణ, ఏపీఓ రంగనాయకమ్మ, ఉద్యోగులు శ్రీనివాసరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

జాతరలో తప్పిపోయిన మిర్యాలగూడెం వాసి



వరదరాజు

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం తీర్థాలలో మహాశివరాత్రి సందర్భంగా జరిగిన జాతరకు వచ్చిన నల్లగొండ జిల్లా మిర్యాలగూడెంకు చెందిన కందరబోయిన వరదరాజు(56) తప్పిపోయాడు. ఈనెల 8న కుటుంబంతో కలిసి జాతరకు వచ్చిన ఆయన మధ్యలో విడిపోయాడు. ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియడం లేదని కుటుంబీకులు గోడు వెళ్లబోసుకున్నారు. కాగా, వరదరాజు కుటుంబం మిర్యాలగూడెం నందిపాడులోని ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా నివాసముంటోంది.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,100	2,100
పెసలు	8,075	6,500
కందులు	9,400	8,300
మిర్చి	20,500	13,500
మిర్చి తాలు	11,000	8,800
పత్తి	7,625	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర రూ.13,045

పాట్లు పడితేనే పాస్‌పోర్ట్

- సమస్యలకు నిలయంగా ఖమ్మంలోని కేంద్రం
- సిబ్బంది కొరత.. మౌలిక వసతుల లేమి
- వెరిఫికేషన్ అధికారి కూడా లేక అవస్థలు
- సమస్య తలెత్తితే హైదరాబాద్ కార్యాలయానికి వెళ్లాల్సిందే..



వినియోగదారులకు సేవలందిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

ఖమ్మంగాంధీచౌక్: విదేశాలకు వెళ్లే వారే కాకుండా ఇతర అవసరాల కోసం పాస్‌పోర్ట్ తీసుకునేవారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాస్ట్‌పోర్ట్‌లు జారీ చేసేందుకు ఖమ్మంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సేవా కేంద్రం సమస్యలకు నిలయంగా మారింది. గతంలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం హైదరాబాద్‌లో మాత్రమే ఉండగా.. విదేశాలకు వెళ్తున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతుండటంతో పోస్టాఫీసుల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖ మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం ఎంపీగా కొనసాగిన సమయంలో ఖమ్మంలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేయించారు. తొలుత నిత్యం 50 స్లాట్లకు అవకాశం ఉండగా.. ఇప్పుడు 95 స్లాట్లు బుక్ చేసుకునే అవకాశముంది. అలాగే, వర్క్ వీసాపై విదేశాలకు వెళ్లే వారి కోసం మరో 15 స్లాట్లు కేటాయించారు. అయితే, ఈ కేంద్రం ఉమ్మడి జిల్లా వాసులకు ఉపయోగకరంగానే ఉన్నా అందుకు తగిన విధంగా సేవలు అందకపోవడం, గతంలో సమకూర్చిన సౌకర్యాలు ఇప్పుడు లేకపోవడంతో ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.

ఆన్‌లైన్‌లోనే పరిశీలన

ఖమ్మంలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేసిన సమయాన ఒక వెరిఫికేషన్ అధికారిని నియమించారు. అలాగే, తపాలా శాఖకు చెందిన ఇద్దరు పోస్టల్ అసిస్టెంట్లు, రక్షణ కోసం పోలీస్ శాఖకు చెందిన ఓ ఉద్యోగిని కేటాయించారు. అయితే, 2023 డిసెంబర్ తర్వాత వెరిఫికేషన్ అధికారి కేటాయింపు నిలిచిపోయింది. అదేమంటే హైదరాబాద్ పాస్‌పోర్ట్ రీజినల్ కార్యాలయంలో సిబ్బంది కొరత కారణంగా నియమించడం లేదని చెబుతున్నారు. వెరిఫికేషన్ అధికారి ఉంటే ఇక్కడే దరఖాస్తుదారుల సర్టిఫికెట్లు, ఇతర పత్రాలను పరిశీలిస్తారు. సదరు అధికారి లేని కారణంగా సర్టిఫికెట్లన్నీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే హైదరాబాద్‌లోని రీజినల్ కార్యాలయంలో పరిశీలించి అనుమతించాకే పాస్‌పోర్ట్ జారీ అవుతోంది. ఏవైనా తప్పిదాలు ఉంటే దరఖాస్తుదారులు హైదరాబాద్ వెళ్లకతప్పటం లేదు. కొందరైతే రెండు, మూడు సార్లు వెళ్లాల్సి వస్తుండటంతో అవస్థ పడుతున్నారు.

నామమాత్రంగా సదుపాయాలు

ఖమ్మంలోని పాస్‌పోర్ట్ సేవా కేంద్రంలో సరైన సదుపాయాలు లేక వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ కేంద్రానికి ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, నల్లగొండ, మహబూబాబాద్ జిల్లాలే కాక కొన్నిసార్లు ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, జగిత్యాల, కరీంనగర్ తదితర జిల్లాల నుంచి కూడా వస్తున్నారు. పాస్‌పోర్ట్ స్లాట్ ఎక్కడి నుంచైనా బుక్ చేసుకునే అవకాశముండటంతో ఆన్‌లైన్‌లో ఖాళీగా ఉన్న ప్రాంతాలను గుర్తించి సుదూర ప్రాంతాల వాసులు కూడా దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మొత్తం ఆన్‌లైన్‌లో ప్రక్రియ జరిగే ఈ కేంద్రంలో ఏసీ లేకపోవడంతో తరచుగా కంప్యూటర్లు మొరాయిస్తున్నాయని చెబుతున్నారు. ఇక ఆవరణలో సరిపడా కుర్చీలు లేక దరఖాస్తుదారులతో పాటు సహాయకులు కేంద్రం వెలుపల ఎండ, వానలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమయాన పిల్లలతో వచ్చే వారు పడరాని పాట్లు పడుతున్నారు. ఇకకైనా తాగునీటి సౌకర్యం కల్పించి అటెండర్, వాచ్‌మెన్‌ను నియమించడంతో పాటు వెరిఫికేషన్ అధికారిని సైతం కేటాయించాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.



సౌకర్యాలు లేక సేవా కేంద్రం బయట కూర్చున్న దరఖాస్తుదారులు

సిబ్బంది కొరతతో సతమతం

పోస్టల్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రంలో సరిపడా సిబ్బంది లేక అటు వినియోగదారులు, ఇటు ఉన్న ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో ఇద్దరు పోస్టల్ ఉద్యోగులు, ఒక పోలీస్ కానిస్టేబుల్ మాత్రమే పనిచేస్తుండగా.. నిత్యం 95 మంది ధ్రువపత్రాలను పరిశీలించటం, బయోమెట్రిక్ విధానంలో వివరాలు నమోదు చేయడం, వేలిముద్రలు, ఐరిష్ సేకరించడం కష్టంగా మారుతోంది.

మూడు సార్లు హైదరాబాద్ వెళ్లా..



ఇక్కడ వెరిఫికేషన్ అధికారి లేకపోవటంతో హైదరాబాద్ రీజినల్ కార్యాలయానికి మూడు సార్లు వెళ్లాల్సి వచ్చింది. ఖమ్మంలో పాస్‌పోర్ట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించలేదు. కూర్చోవడానికి కూడా వసతి లేదు. వెరిఫికేషన్ అధికారిని ఇకనైనా నియమించి సౌకర్యాలను మెరుగుపర్చాలి. – డాక్టర్ పెద్దిరెడ్డి సుదీంద్రరెడ్డి, శ్రీరక్ష వైద్యశాల, ఖమ్మం

సిబ్బంది కొరతతో జాప్యం



పాస్‌పోర్ట్ కేంద్రంలో సరిపడా సిబ్బంది లేక ధ్రువపత్రాల పరిశీలన, ఇతర పనుల్లో జాప్యం జరుగుతోంది. వెరిఫికేషన్ అధికారి ఉంటే పనులు చకచకా జరుగుతాయి. సమస్య ఉన్నా ఇక్కడే పరిష్కారమవుతుంది. కానీ, ఇప్పుడు హైదరాబాద్ వెళ్లడం ఇబ్బందిగా ఉంటోంది. కార్యాలయంలో కూర్చోవడానికి కూడా సౌకర్యం లేదు. – వి.సత్యనారాయణ, భద్రాద్రి కొత్తగూడెం

బీజేపీ పాలనకు చరమగీతం పాడాలి

- డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్
- కాంగ్రెస్‌లో చేరిన డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు



డీసీసీబీ చైర్మన్ దొండపాటికి కండువా కప్పుతున్న దుర్గాప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మతతత్వ, అరాచక పాలనకు చరమగీతం పాడాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్ కండువా కప్పి ఆహ్వానించాక దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అందిస్తున్న ప్రజారంజక పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఇప్పటికే ఉనికి కోల్పోయిన బీఆర్‌ఎస్ పార్టీ బీజేపీతో చీకటి ఒప్పందాలు చేసుకుని లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతుందని తెలిపారు. ఏది ఏమైనా పార్లమెంట్ ఎన్నికల్లో 14సీట్లతో పాటు భవిష్యత్‌లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు దొబ్బల సౌజన్య, రాయల నాగేశ్వరరావు, కమర్తపు మురళి, చావా నారాయణరావు, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చోటే బాబా, పాలకుర్తి నాగేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, మద్ది వీరారెడ్డి, గడ్డం వెంకటయ్య, ఏలూరి రవికుమార్, సూరంశెట్టి కిషోర్ తదితరులు పాల్గొన్నారు

పదవికి ఢోకా లేనట్లేనా?

మధిర: కాంగ్రెస్‌లో చేరిన డీసీసీబీ చైర్మన్, మధిర మండలం ఖమ్మంపాడుకు చెందిన దొండపాటి వెంకటేశ్వరరావు తొలుత బీఆర్‌ఎస్‌లో కొనసాగుతూ ఖమ్మంపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆతర్వాత ఆయనకు డీసీసీబీ వైస్ చైర్మన్ పదవి దక్కింది. ఇటీవల డీసీసీబీ చైర్మన్ నాగభూషణం పదవి కోల్పోగా, వెంకటేశ్వరరావును చైర్మన్‌గా నియమించారు. ఇది జరిగిన కొన్నాళ్లకే ఆయన కాంగ్రెస్‌లో చేరడం గమనార్హం. అయితే, డీసీసీబీ చైర్మన్ పదవి కోసం పలువురు ప్రయత్నిస్తుండగా, వెంకటేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరడం చర్చనీయాంశంగా మారింది.

రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న కేంద్రం

సీఏఏ చట్టాన్ని వ్యతిరేకిస్తూ దిష్టిబొమ్మ దహనం

ఖమ్మంమయూరిసెంటర్: వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనలతో నోటిఫై చేయడం గర్హనీయమని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. ఇలాంటి వ్యవహారాలతో బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ విమర్శించారు. సీఏఏ చట్టం అమలుకు నిరసనగా మంగళవారం ఖమ్మంలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం అమలుకు పూనుకోవటం గర్హనీయమన్నారు. తద్వారా దేశంలో ప్రజల మధ్య మతపరమైన విభజన తీసుకొస్తున్నారని ఆరోపించారు. ఈకార్యక్రమంలో నాయకులు వై.విక్రమ్, ఎం.ఏ.జబ్బార్, ఆర్.ప్రకాష్, బోడపట్ల సుదర్శన్, జిల్లా ఉపేందర్, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, ఎం.గోపాల్, శివన్నారాయణ, సాగర్, గుమ్మడి బిక్షం, పడిగల నాగేశ్వరరావు, ఎం.గణపతి, ఎం.సైదులు, పుల్లారావు పాల్గొన్నారు.

ప్రజలు వ్యతిరేకిస్తున్నా...

లోక్‌సభ ఎన్నికల వేళ సీఏఏ నిబంధనలతో నోటిఫికేషన్ విడుదల చేయడం సరికాదని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పొలిట్‌బ్యూరో ఓ ప్రకటనలో వెల్లడించింది. దేశ ప్రజలు ఇప్పటికే సీఏఏపై వ్యతిరేకంగా ఉన్నా కేంద్రం ముందుకు వెళ్లడం గర్హనీయని తెలిపారు. ఈ అంశంపై అన్ని వర్గాల ప్రజలు పోరాడాలని మాస్‌లైన్ నాయకులు కోరారు.

పోలీసుల 'ఫ్లాగ్ మార్చ్'



వైరా : ఫ్లాగ్ మార్చ్‌లో పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు

వైరా/కల్లూరు: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలని వైరా, కల్లూరు, పెనుబల్లి ఎస్సైలు ఏ.వంశీకృష్ణ, షాకీర్, వెంకటేష్ కోరారు. వైరా, కల్లూరుల్లో మంగళవారం రాత్రి సీఆర్పీఎఫ్ బలగాలతో కలిసి కవాతు(ఫ్లాగ్ మార్చ్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సైలు మాట్లాడుతూ ఎన్నికల వేళ ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులకు అందరూ సహకరించాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'గోద్రెజ్' ఏరియాలో జిల్లాను కలపొద్దు..



సమావేశంలో పాల్గొన్న ఆయిల్‌పామ్ రైతులు

సత్తుపల్లిటౌన్: టీఎస్ ఆయిల్‌ఫెడ్ ఏరియాను గోద్రెజ్ కంపెనీకి కేటాయించే ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని ఆయిల్‌పామ్ రైతులు డిమాండ్ చేశారు. సత్తుపల్లిలో మంగళవారం జరిగిన ఆయిల్‌పామ్ రైతుల సంఘం సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి ప్రసాద్, డైరెక్టర్లు వేంపాటి లక్ష్మీనారాయణ, బండి గుర్నాథరెడ్డి, చలసాని సాంబశివరావు మాట్లాడారు. రైతుల భాగస్వామ్యంతో టీఎస్ ఆయిల్‌ఫెడ్ నడుస్తుండగా.. దీన్ని కాదని గోద్రెజ్ కంపెనీకి ఏరియాను కేటాయించాలని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కంపెనీ ప్రతినిధులు కోరడం సరికాదన్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా గోద్రెజ్ ఏరియాలోని ఆయిల్‌పామ్ గెలలను ఏపీలో ఉన్న కంపెనీకి తరలిస్తుండగా ఏటా రూ.6 కోట్ల మేర జీఎస్టీని ప్రభుత్వం కోల్పోతుందని తెలిపారు. ముప్పై ఏళ్లుగా గోద్రెజ్ కంపెనీ ఈ ప్రాంతంలో ఫ్యాక్టరీ కూడా నిర్మించలేదని పేర్కొన్నారు. కాగా, ఆయిల్ పామ్ ఫార్ములా ఫిక్సేషన్‌ను ఈ ఏడాది 19.02 నుంచి 19.17కి పెంచడంపై వారు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఆయిల్‌పామ్ రైతులు తుంబూరు కృష్ణారెడ్డి, చల్లగుళ్ల నర్సింహారావు, ఆళ్ల నాగేశ్వరరావు, ప్రసాద్ రెడ్డి, విష్ణు, చీకటి చిట్టీరావు, పాలపాటి శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

'రైతునేస్తం' ద్వారా సలహాలు, సూచనలు


ఖమ్మంవ్యవసాయం/కొణిజర్ల: రాష్ట్ర ప్రభుత్వం, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యాన శాస్త్రవేత్తలు, అధికారులు రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఇటీవలే జిల్లాలోని రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం, కొణిజర్ల మండలంలోని తనికెళ్ల, తల్లాడ మండలంలోని కొర్లగూడెం, బోనకల్, కూసుమంచిల్లోని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం అందుబాటులోకి రాగా, మంగళవారం జరిగిన రైతునేస్తం కార్యక్రమంలో 414 మంది రైతులు పాల్గొన్నారు. తొలుత హైదరాబాద్ నుంచి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ రైతులకు పంటల సాగులో ఎదురయ్యే సమస్యలను వివరిస్తే శాస్త్రవేత్తలు పరిష్కార మార్గాలను సూచిస్తారని తెలిపారు. అనంతరం సీనియర్ శాస్త్రవేత్త సుచరిత, పరిశోధన సంచాలకులు జి.శ్రీనివాస్, శాస్త్రవేత్త సీహెచ్.ప్రగతికుమారి పలు అంశాలపై సూచనలు చేశారు. కాగా, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎం.విజయనిర్మల తనికెళ్ల రైతువేదికలో జరిగిన కార్యక్రమంలో పాల్గొనగా ఏడీఏలు శ్రీనివాసరెడ్డి, సతీష్, ఏఓలు బాలాజీ, పవన్‌కుమార్, నర్సింహారావు, ఉమామహేశ్వరరెడ్డి, వాహిని, హార్టికల్చర్ ఏడీ అనిత, హెచ్ఓ వేణు తదితరులు పాల్గొన్నారు.

అడవి పంది అడ్డు రావడంతో ఆటో బోల్తా

- ఎనిమిది మంది కూలీలకు గాయాలు, ఒకరి మృతి
- మిర్చి తోట ఏరేందుకు వెళ్తుండగా ప్రమాదం



మృతురాలు పార్వతి (ఫైల్)



క్షతగాత్రురాలిని కుర్చీలోనే కూర్చోబెట్టి సెలైన్ ఎక్కిస్తున్న దృశ్యం

నేలకొండపల్లి: పొట్ట కూటి కోసం వెళ్తున్న కూలీల ఆటోకు అడవి పంది అడ్డుగా రావడంతో డ్రైవర్ తప్పించేందుకు యత్నించగా ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఎనిమిది మందికి తీవ్ర గాయాలు కాగా, చికిత్స అందిస్తుండగా ఓ మహిళ మృతి చెందింది. జిల్లాలోని నేలకొండపల్లి మండలంలో మంగళవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి.

సూర్యాపేట నుంచి ఏపీకి...

సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు మిర్చి వేరేందుకు ఆటోల్లో వివిధ ప్రాంతాలకు వెళ్తారు. ఈక్రమంలో ఏపీలోని కృష్ణా జిల్లా పెనుగ్రంచిప్రోలు మండలం గోగినేనిపాలెం గ్రామానికి మంగళవారం ఉదయం బయలుదేరారు. ఆటో నేలకొండపల్లి మండలం సుర్దేపల్లి– రామచంద్రాపురం గ్రామాల మధ్యకు రాగానే అడవి పంది అడ్డుగా వచ్చింది. దీంతో దాన్ని తప్పించేందుకు ఆటోడ్రైవర్ యత్నించగా.. ఆటో పక్కనే పొలాల్లో బోల్తా పడింది. ఘటనతో ఆందోళన చెందిన కూలీల హాహాకారాలు విన్న రెండు గ్రామాల ప్రజలు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనలో కూలీలు కందుల నర్సమ్మ, సునీత, దార్ల రాధమ్మ, దార్ల నాగమ్మ, పి.ఆరోగ్యమ్మ, కొత్తపల్లి జ్యోతి, పి.పార్వతి(42)కి తీవ్ర గాయాలు కాగా, డ్రైవర్ దార్ల నాగేశ్వరరావు సైతం గాయపడ్డాడు. ఈమేరకు క్షతగాత్రులను ఆటోల ద్వారా నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే, అక్కడ సరిపడా సౌకర్యాలు లేక ఓ మహిళను కుర్చీలో కూర్చోబెట్టి సెలైన్ ఎక్కిస్తుండగా బాధిత కుటుంబ సభ్యులు అధికారుల తీరును తప్పుపట్టారు. అనంతరం క్షతగాత్రుల్లో పార్వతి పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. నేలకొండపల్లి పోలీసులు ఘటనపై కేసు నమోదు చేయగా, ప్రమాదంపై కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఆరా తీశారు.

సహచరుడి కుటుంబానికి కానిస్టేబుళ్ల చేయూత



లోక్‌చంద్ భార్యకు చెక్కు అందజేస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: 2000 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ భూక్యా లోక్‌చంద్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబానికి సహచరులు అండగా నిలిచారు. గతనెల 4న లోక్‌చంద్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆయన బ్యాచ్ కానిస్టేబుళ్లు, పోలీసు అధికారులు సేకరించిన రూ.2.27 లక్షల చెక్కును మంగళవారం సీపీ సునీల్ దత్ చేతుల మీదుగా లోక్‌చంద్ సతీమణి జ్యోతికి అందజేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తల్లాడ: మండలంలోని మల్లవరంలో సోమవారం రాత్రి రేషన్ షాపు నుంచి అక్రమంగా తరలిస్తున్న 7.50క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ కొండల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో పునాటి రామారావుకు చెందిన షాపు నుండి వాహనంలో డ్రైవర్ తోట మధు 15 బస్తాల బియ్యాన్ని తీసుకుని వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈమేరకు డీలర్ రామారావు, డ్రైవర్ మధుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



మృతి చెందిన చుక్కల దుప్పి

సత్తుపల్లిటౌన్: వీధి కుక్కలు వెంబడించి గాయపర్చడంతో చుక్కల దుప్పి మృతి చెందింది. సత్తుపల్లిలో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు.. సత్తుపల్లిలోని ఎన్టీఆర్‌నగర్ వైపు ఉన్న సింగరేణి ఓబీ మట్టి దిబ్బల వైపు నుంచి వీధికుక్కలు అడవిలోకి ప్రవేశించి చుక్కల దుప్పిని వెంబడించాయి. దీంతో మెట్టు ఆంజనేయస్వామి గుడి సమీపాన అర్బన్‌పార్క్ ఫెన్సింగ్‌కు తగిలిన దుప్పి తీవ్రంగా గాయపడింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది స్థానిక పశువైద్యశాలకు తరలించగా చికిత్స చేయిస్తుండగానే మృతి చెందింది. డీఆర్ఓ ముత్యాలరావు, ఎఫ్‌బీఓ ముక్తి వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు.

అదుపు తప్పిన వాహనం, వ్యక్తి మృతి

పిల్లలను హాస్టల్‌లో దింపి వస్తుండగా ఘటన



రవికుమార్ (ఫైల్)

కారేపల్లి: ద్విచక్రవాహనం అదుపుతప్పగా కింద పడిన వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోలంపల్లికి చెందిన తేజావత్ రవికుమార్(35) ఇద్దరు కుమారులు ఖమ్మంలోని ప్రైవేట్ పాఠశాల హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు. ఆదివారం వారిని ఇంటికి తీసుకొచ్చిన రవికుమార్ తిరిగి సోమవారం ద్విచక్రవాహనంపై తీసుకెళ్లి హాస్టల్‌లో దింపాక రాత్రి తిరుగు పయనమయ్యాడు. ఈక్రమంలో మండలంలోని ఆలియాతండా వద్ద మూలమలుపులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న మట్టిదిబ్బలను ఢీకొట్టి ఎదురుగా ఉన్న ప్రహరీకి బలంగా తాకడంతో రవికుమార్‌కు తీవ్రగాయాలయ్యాడు. దీంతో ఆయనను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి కిమ్స్‌కు తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. ఘటనపై రవి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎన్.రాజారాం తెలిపారు.

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మృతి



సుధాకర్ (ఫైల్)

నేలకొండపల్లి: మండలంలోని అమ్మగూడెంకు చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ అడపాల సుధాకర్(35) మృతి చెందాడు. ద్విచక్రవాహనంపై మంగళవారం ఉదయం సరుకుల కోసం నేలకొండపల్లికి వస్తున్న ఆయన ఎంపీడీఓ కార్యాలయం సమీపాన అస్వస్థతకు గురయ్యాడు. దీంతో బైక్‌ను పక్కన ఆపి ఓ షాపు వద్ద కుప్పకూలాడు. దీంతో స్థానికులు నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయన గుండె పట్టుకుని బాధపడ్డాడని కొందరు, ఫిట్స్ వచ్చాయని మరికొందరు చెబుతున్నారు. రాజేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న సుధాకర్‌కు భార్య, 11 నెలల కుమార్తె ఉన్నారు. ఆయన మృతదేహం వద్ద ఏఈలు కె.రామారావు, బాలాజీ, ఉద్యోగులు నివాళులర్పించారు.